కథానిక

# తండ్రీ - కొడుకూ

ఆర్. యం. చిదంబరం

'ఆ...బేట్ - బేట్ సార్!' అన్నాడు సినిమాలో విలన్‌లా కోరమీసాల్లోంచి కోరగా చూస్తూ - నవ్వుతూ ఆ వ్యక్తి.

కొంచెం దూరంగావున్న జనం ఇంకా కొంచెం ముందుకు జరిగారు.

"నిన్న టూ రుపీస్ పోయాయండి - ఈ గాంబ్లింగులో" అనేసి ప్రపంచాన్ని ఉద్ధరించినట్లు నవ్వాడు ఓ స్టూడెంటు.

ఓ మూలవున్న విద్యుద్దీపాల వరస తళుక్కుమంది. గాంబ్లింగుహాల్లో వెలుతురు మోసంలా పెరిగింది.

రామం ఇంకొంచెం ముందుకు జరిగి బొటనవేలిమీద నిలబడి లోపలికి తొంగిచూశాడు. ఏదీ సరిగ్గా కనిపించటంలేదు.

"లక్కీ కలర్ సార్-బేట్!..." అంటున్నాడా మీసాల మనిషి. అద్దెకుచ్చుకున్న తెల్లటి బట్టలు అందర్నీ వెక్కిరిస్తున్నాయ్.

తెల్లటిబంతి పెట్టెలోపడి ఈతచేతకాక నీట మునుగుతున్న వాడిలా కొట్టుకుంటోంది. అన్ని రంగులూ - ఎరుపు, ఆకుపచ్చ, తెలుపు, నీలం, బెట్టర్సుకేసి కన్నుగీటుతున్నాయ్.

ఘల్లున చిల్లరమోగింది. ఆ గుంపులో పదిమందిచేతికి పది అట్టముక్కలొచ్చాయి. బేడా పావలా - అర్థా - బేట్! బంతి గెంతులేసి అంతు తేల్చింది. ఎనమండుగురికి రెట్టింపునకు రెట్టింపు వచ్చాయి.

"ఒరేయ్ రామం!... మా అన్నయ్య నిన్న పావలాకి అర్థరూపాయి సంపాదించాడురా... నిన్న నాకు ప్లాస్టిక్ బెల్టు కొనిచ్చాడురా" అన్నాడు సూరి.

నిజమే కామోలు!... తనకు మాత్రం బెల్టు అక్కర్లేదా యేమిటి?...రామంబుర్రలో కుమ్మరిపురుగు ప్రవేశించి నానాహంగామా చేస్తోంది.

మళ్ళీ చిల్లర మోత! బంతి గెంతుతున్న చప్పుడు. ఒకడు మెరుస్తున్న రూపాయ్ జేబులో వేసుకున్నాడు. అతని మొహంలో కూడా వెయ్యి సూర్యులు కనిపించారు.

రామం జేబు తడుముకున్నాడు.

బేడకాసు తగిలింది!... అమ్మో!... అమ్మ తంతుంది - నాన్న వీపుచీరేస్తాడు - ఎలాగ?

"ఒరేరామం! నీకు చెయ్యందుతుంది. ఈ బేడ ఎర్రరంగుమీద వుంచరా?" అన్నాడు బేడకాసందిస్తూ రవణ.

రామం పంజరంలోవున్న చిలుకలాగ అతని వంక చూశాడు.

"ఇది నాడబ్బేరా బాబూ!...అంత భయపడతావే?...పటి పిరికిదద్దమ్మ. అచోటు నాకిచ్చేయ్. నే కాస్తా"అన్నాడు ఓ పర్వతాన్ని ఎత్తగలిగినంత ధీమాతో.

రామం వణుకుతూ, బేడఅందిచ్చి "ఎరుపు" అన్నాడు.

ఆ కోరమీసాలతను చేతిలో గుండ్రటి అట్టముక్క వుంచాడు. రామానికి అక్కడివాళ్ళంతా ఆ కోరమీసాలతనిలా కనిపించారు... ఎక్కడో కల్లువాసన ఘాటుగా కొడుతోంది. అబ్బబ్బ...

రెండునిముషాలుగడిచాక ఎరుపురంగుగెల్చింది. రామంచేతిలో పావలాకాసు పడింది. కన్ను కుట్టిందికూడా. ఈసారి తప్పకుండా సూరి గ్లోకోజు పేకెట్టు కొంటాడు. ఆపావలా సూరి జేబులోకి పరుగెత్తింది. రామంచేయి జేబులోకెళ్ళి బేడతో తిరిగొచ్చింది. ఆ మీసాలతని కందించి "ఎరుపు" అన్నాడు.

ప్లాస్టిక్కు బెల్టు - గ్లూకోజుపాకెట్టు- సిల్కురుమాలు - అన్నీ కళ్ళముందు రంగులరాట్నంలా తిరుగుతున్నాయ్.

ఆకుపచ్చ గెల్చింది.

రామం పాతాళంలో పడ్డాడు. నవ్వుతున్న సూరికేసి చూశాడు. పట్టుకుని చితక్కొడదామని పించింది.

అమ్మో!...సూరి చాలా మొండి. వాడితో కయ్యంకూడదు.

"ఇంటికిపోదాం పదరా!" అన్నాడు సూరి.

"ఊ" అంటూ తలూంచుకుని రామం ఇంటికి బయలుదేరాడు.

"పోతేపోయిందిరా. వెధవబేడ- అంతేడుస్తా వెందుకురా?...ఓస్...నేనైతే ఏ కోట్లోంచో- గూట్లోంచో ఎత్తుకొస్తాను, వట్టి పిరికిపంద-చూడు మరి పావలా!" అని జేబులోకి ఓమారు చూసుకున్నాడు.

"మాఅమ్మ కొడుతుందిరా - పంచదార కొనుక్కురమ్మంది...ఎలాగ?. ఓబేడ ఇవ్వవురా?"

సూరి హఠాత్తుగా ముఖం గంభీరం చేసుకున్నాడు.

ఇంటికొచ్చేసరికి రామంతల్లి అరుగుమీదనే కూర్చునివుంది. చిన్నరామాన్ని చూసి నవ్వుతున్న అమ్మ రామంకంటికి భూతంలా, రాక్షసిలా కనిపించింది.

"ఏరా !...ఇంతాలస్యమైందే? చీకటికూడా పడింది."

నెమ్మదిగా కోపంలేకుండాఅన్నా రామానికి ఆమె గర్జిస్తున్నట్టేవుంది. తనదారిన తనుపోక ఏదో పనున్నవాడిలా సూరి స్తంభానికి జారబడి నిలబడ్డాడు. రామం బిక్కమొహం వేసుకుని ఖూనీచేసినవాడిలా నిలబడ్డాడు.

"పంచదార ఏదిరా?..."

"మరే. మరే. అమ్మా! బేడకాసుపోయిందే- అంచేత తేలేదే! కళ్ళంటువస్తున్న నీటిని ఆపుచేయటానికి యత్నించాడు.

"అవునండి. అక్కడ జూదంఆడితే పోయిందండి. నాకు పావలావచ్చిందంటే తనూ బేడ పెట్టాడండి. పోయింది పాపం!" అన్నాడు సూరి సానుభూతిగా.

రామం అనుకున్నది—దారంతా ఆలోచించి తయారుచేసిన ప్లాను భూమిలోకి కుంగిపోయింది. ఎక్కడో పడిపోయిందని అందామనుకున్నాడు కాని, ఈలోగా వీడికి కంగారెందుకు? తను మొన్న ఆటకురాలేదని గా మోలు!.. వెధవకక్షా వీడూనూ! యెంత జాగ్రత్తగా జ్ఞాపకంపెట్టుకున్నాడు! దెబ్బకుదెబ్బతీయటానికి!

"జూదం మొదలెట్టావురా...హారి నిన్ను తగలెయ్యా — నువ్వెందుకు పుట్టావురా వెధవా? మీనాన్నతో నువ్వూచేరావా?"

రామంవీపు ఆవేళ పాపంచేసుకు నుండాలి.

సుడిగాలిలా ధ్వనిస్తూ ఏడ్చాడు. అంతరాంతరాలలోవుండే సానుభూతితో నిజంచెబితే దండించరనే విశ్వాసంతో సూరి రామంతరపున వకీలుగా వాదిస్తే చివరికతనికి శిక్షతప్పలేదు...గబగబా మెట్లుదిగి చరచరా వెళ్ళిపోయేడు.

అతనికేసి చూస్తూ పళ్ళు పటపట కొరికాడు రామం.

మరోనాలుగు వడ్డించాలనుకున్న తల్లి అర్థంలేని ఆలోచన్లో పడిపోయింది. ఇంట్లో అందరికీ పాడుబుద్ధులే!... కానీవుంటే దానికోసం నలుగురూ కురుక్షేత్రసంగ్రామ ప్రదర్శన చేయటం - ఏ కంపెనీయో దాన్ని తన్నుకుపోవటం- రామం సముద్రపుటలలధ్వనిని జపిస్తూ ఏడ్చాడు.

ప్రశాంతించిన వాతావరణం రాత్రి ఎనిమిదింటికి మేలుకుంది. స్కూలునుంచి సాయంత్రం ఇంటికిరావటం వీలుకుదని రామంనాన్న ఎనిమిదింటికే వచ్చాడు. ఆవేళ క్లోజింగు రెండు రావాల్సిందే - రాలేదు. ఆవేళటి ఆశలకు కూడా క్లోజింగే!

"నాన్నా! మరే!...తమ్ముడికి అమ్మ బేడిచ్చి పంచదార తీసుకురమ్మంటే ఆ సూరిగాడితోకలిసి జూదం ఆడేసి పారేసు కొచ్చాడు నాన్నా..." అని చెల్లాయి ఫిర్యాదు చేసింది.

గుడ్డిలాంతరుముందు ఎర్రటికళ్ళతో పాఠాలు చదువుకుంటున్న రామం ఇంటికప్పు విరిగి మీద పడ్డట్టు ఉలిక్కి పడ్డాడు...అవును... దానికీ తనమీద కోపమే. మొన్న ఆ నల్లటి రైలింజను దానికివ్వలేదని దానికోపం. అంతాకలిసి తన్ను చప్పరిస్తున్నారు. మొన్ననేదో చిన్నచీటీముక్క తనకు తెలియకుండా సినిమాపెట్టెకంటించాడు. అదేదో బ్రాకెట్టు రసీదని రావాల్సినసొమ్ము తన వలన పోయిందని నాన్న చావబాదాడు అడ్డొచ్చిన అమ్మమీద మింగేసేవాడిలా కేకేశాడు.

"క్రాకెట్టుకూడా జూదమేనట..మరి నాన్న నెవడూ తన్నడే!" అనుకున్నాడు రామం.

"ఒరే రామం! ఇలారా! నీ చదువు చాలు!" అని నరకంనుంచి పిలుపు వచ్చింది. అమ్మవుంటే బాగుండేది. పోనీ అన్నయ్య వున్నాడా అంటే అతను గదిలో కూర్చుని పజిల్సు సాల్వు చేస్తున్నాడు. హైడ్రోజన్ బాంబు చెవులదగ్గర పేలినా అర్థరాత్రి ప్రశాంతతలో వుంటాడు. రెండోసారికూడా పిలుపు వచ్చింది. పుస్తకాన్ని గోడ మూలకు విసిరికొట్టి తండ్రిముందు హాజరయ్యాడు.

"ఏరా! జూదం మొదలెట్టావా? నువ్వు ఎంతున్నావు? చేసేపనులేవిటి?"

చెంప ఛెళ్లుమంది.

కళ్లలో నీరుబికింది.

అమ్మవచ్చి రామాన్ని రెక్కపట్టుకుని ఈడ్చుకు పోయింది. అంత ఏడుపులోను రామం చెల్లాయి కేసి కోపంగా చూశాడు.

"రంగారావుగారూ!"అంటూ పిల్చారు అరుగు మీదకొచ్చిన ఇద్దరు మనుషులు. రంగారావు గడపదగ్గర నిలబడి ఏమన్నట్టు చూశాడు.

"మన ఆచారి నాలుగు-సున్నామీద పది రూపాయలు కట్టాడండి. మీరు కట్టిన పది నంబర్లలోనూ అది లేదండి. పోనీ అదికూడా కట్టేస్తే బాగుంటుందిగా-ఏ ఛాన్సు ఎలా కుదురుతుందో!" అన్నాడు బట్టతలతను. రంగారావు వాళ్ళముందు మొదటిసారిగా మొహంచిట్లించాడు.

"ఇప్పుడేం డబ్బులేదు. ఇంతకాలం కట్టాను. వచ్చిందేవిటి? ఇప్పుడు రాకపోటానికి?"

"పోనీ రేపిద్దురు గాని లెండి. కొత్తగా మాట్లాడుతున్నారు. అలా అధైర్యపడిపోతారే?"

"రేపొద్దున్న చూద్దాం" అనేసి రంగారావు వాళ్ళకేసి చూడకుండా లోపలికొచ్చేశాడు. వచ్చిన వాళ్ళిద్దరూ ఒకరిమొహా లొకరు చూసుకుని వెళ్ళిపోయారు. చెల్లాయి రామానికి క్షమాపణ చెప్పుకుంటోంది. తల్లి బలవంతంవలన భయం చేతిలో నలిగిపోతూ లాంతరుముందు కూర్చుని చదువుకుంటున్నాడు.

ఇంతరభస జరిగాక పంచదారకి మరో బేడ కావాలని అడగటానికి ఎవరికీ ధైర్యం లేక పోయింది. అడిగితేమాత్రం ఎక్కణ్ణుంచొస్తుంది? ఏ డాలిఫిన్ రెక్కలమీదో ఎగిరిపోయుంటుంది. రంగారావుకి కూడా కోయుటున్న మాటలు గుర్తుకొచ్చాయి.

"క్రాకెట్టాడటానికి డబ్బుంది కాని అవసరమైన వస్తువులు కొనుక్కోటానికి లేదే?...ఇంక అరువివ్వను. నా బాకీ వెంటనే చెల్లించేయండి."

పాత చెప్పుతో మొహంమీద కొట్టినట్టన్నాడు. అంత కోపం రామంమీదికి ట్రాన్స్‌ఫరైంది. తండ్రి పక్కనుంచి వెడుతుంటే ఆకారం లేని నీడదగ్గరకు జరుగుతున్నట్టనిపించింది. ఒకవేళ మళ్ళా కొడితే? అన్నయ్యకు హాఫ్‌ఇయర్లీ పరీక్షలలో అన్నీ సున్నలు-ఎర్రపెన్సిలుతోను, నీలం పెన్సిలుతోను-గుండ్రంగా-వృత్తలేఖిని అవసరం లేకుండా గీసిన సున్నలు-కాని చదవడు. పజిల్సు సాల్వు చేస్తాడు. నాన్న అతని విషయం పట్టించుకోడు. సూరిగాడి సావాసం చేసి తను తప్పుచేస్తే వంతులు వేసుకుని బాదారు.

ఆ రాత్రి రంగారావు గోడగడియారంకొట్టిన ప్రతి గంటా విన్నాడు. తనకు దూరంగా రామం మూడంకె వేసి పడుకున్నాడు. పెద్ద లాంతరు. దాని వెనకాల చీకటి యొలాగ వుంటుంది. ఆ చీకట్లో రామం కళ్ళు దీనంగా మెరిశాయి.

వెలుతుర్లోమాత్రం మంచు చుక్కలా రెండు నీటిచుక్కలు మెరిశాయి. ఆ వెలుతురుకే రామం నాన్న నుదుటిమీది గీతలు జరజర కదిలాయి.

"అనవసరంగా కుర్రాణ్ణి కొట్టిన ఈ వెధవ చేతుల్ని నరికి పారేయాలి" అనుకున్నాడు రంగారావు...కాని తను గోరాకుంభార్ కాదుగా... ఇంటికి ఎంత త్వరగా రావాలనుకున్నా ఆచారి గేలంవేసి లాగేస్తాడు. వీదో అంకె గన్‌షాట్ అంటాడు. తను చాలా డబ్బు దానికి హారతిచ్చాడు. పోతే పోయిందని తను మళ్ళీ డబ్బు కడుతున్నాడు. పొడవూ వెడల్పూ లేని అంకెల మీద, పేకమేడలా, తన జీవిత సౌధాన్ని నిర్మింపయత్నించాడు.

"నాన్నా నాన్నా కొట్టకు..నేనేంచేయలేదు. సూరిగాడికి మంచి బెట్టుంది, వాడు రుమాలు కొన్నాడు. నేనూ కొనుక్కుందామని ఎర్రరంగు మీద కాశాను...అంతే. మరి గ్లాకోజు పేకెటు

వద్దుమరీ...అమ్మో... కొట్టకు... ఇంకెప్పుడూ చేయను."

రామం నిద్దట్లో పేలుతున్నాడు. రంగారావు గుండెలో ఆటంబాంబు పేలింది.

"నాన్నా, ఆ సూరికి దబ్బొచ్చింది. అందుకే నేనూ కొశాను. అమ్మా! కొట్టకే!"

రామం తల్లి అతన్ని ఫూరడించింది.

రంగారావు లెక్కవేశాడు. దాదాపు రెండు వందలు పోయుంటాయ్-చాలా అప్పులున్నాయి. అస్తమానం ఓపెనింగు-క్లోజింగు. ఆ 'పాటే' తన్ను రాజ్యమేలింది. ఆ న్యూయార్కు కాటన్ మార్కెట్ తనకూ, సంసార సుఖానికీ మధ్య అడ్డుతెరైంది. మళ్ళీ రామంఏదో అంటున్నాడు.

ఏడుస్తూ తెల్లారింది.రామం ఇంకాలేవనేలేదు.

"జీరో ఓపెనింగ్ వచ్చిందండి. మీరు తాని మీదేమీ కట్టలేదు. నాలుగు క్లోజింగుతప్పదు. ఆరు మూడైనాసరే—జీరో ఫోర్ గన్‌షాట్. ఎంతో కొంత కట్టేయండి. చాలామంది కట్టే శారు"అంటూ ఆచారి బిల్లుపుస్తకం తీశాడు.

"ఆచారిగారూ!...నేనీఆట పూర్తిగా మాను కున్నానండి. ఇంక ఆగొడవలు నాదగ్గరెత్తకండి. నాకుబుద్ధొచ్చింది. నామూలంగా ఇంట్లోఅందరూ జూదగాళ్ళైపోతున్నారు. వెళ్ళిపొండి."

రంగారావు మాటలువిన్న ఆచారి తెల్లమొహం వేసి జారుకున్నాడు.

ఈ మాటలువిన్న రామంతల్లి గబగబా పరు గెత్తుకునివెళ్ళి రామాన్ని కౌగలించుకొంది. అర్థం కాని చూపులు చూస్తున్న రామం అమాయకంగా నవ్వాడు.

# సవ్యాపసవ్యాలు

అవసరాల రామకృష్ణారావు

రామగోపాలం నేను పెళ్ళివారింటికి వెళ్ళేము.

పెళ్ళికూతురు, పెళ్ళికొడుకు మా యెదురుగా కూర్చున్నారు. ఇద్దరూ తీయగా, భారంగా ఎన్నో ఆశలతోనిండినట్టు ఒకరివైపుఒకరు చూస్తున్నారు. మా రామగోపాలం బాగా పాడగలడు. 'ఓపాట పాడండి" అన్నారు. అనడమే తడవుగా అందు కున్నాడు.

'ఇంతేనన్నా, బ్రతుకంతేనన్నా' పెళ్ళికూతురి కళ సగంతగ్గింది. పాటబాగుంది కాబట్టి మరోటి పాడమన్నారు.

"పాడుజీవితము, యవ్వనం, మూన్నాళ్ళ ముచ్చటలోయి" ఇక భరించలేక నేను ఆపెయ్య మన్నాను. రామగోపాలినికే కాదు యిలాంటి అసందర్భపు పాటలు వాయించడం బ్యాండువా ళ్ళందరికీ తెలుసు. నా పెళ్ళినాడు "దూరదేశ మేగెదవో పెండ్లికూతురా" అన్న వూరేగింపు పాట జన్మలో మరువగలనా?

* * *

నాకు బాగా జ్ఞాపకం. దొడ్డమ్మ పిల్లలిద్దరికీ జ్వరం. నామటుకు నాకు జలుబూ దగ్గూ అసలు వంట్లో బాగులేదు. మా పెదనాన్న వూళ్ళోలేడు. వాచింగుకి నిడుబ్రోలు వెళ్ళేడు. ఈవిషయాలన్నీ అలా ఉంచండి. ఇంటికి ఎవరో దూరపుచుట్టం మా దొడ్డమ్మ ఆడబడుచు కొడుకుట, వచ్చాడు అదేంఖర్మమో వచ్చిన మరునాడే పాపం అతనికీ జ్వరం పట్టుకుంది.

జ్వరతీవ్రతచేత హాల్లో పడుకుని పడక్కు ర్చీలో కూలబడ్డాడు. పిల్లలిద్దరూ అన్నంపెట్టమని అల్లరిపెడుతున్నారు. పోనీ కాస్తసాయంచేదాం, పిల్లల్ని లేద్దాం అని వంటింట్లోకివెళ్ళి చూశాను. నిలువునా నీరైపోయాను! ప్రపంచంలో యింత అపసవ్యపుమనుషు లుంటారా అనిపించింది. మా దొడ్డమ్మ పెసరట్లకూరట, చేసుకుంటోంది! పెసర పప్పు రుబ్బుకోవాలి, అట్లుచెయ్యాలి, అట్లన్నీ ముక్కలుగా కోసుకోవాలి, వేరే మసాలారుబ్బి పెట్టుకోవాలి! దొడ్డమ్మ మంచిదైనామే ఎంచు కుంది! చుట్టానికైనా వెరిచిందికాదని నాకు నవ్వొచ్చింది. ఇలాంటి మనుషులు లేరంటారా? కావలిస్తే రాజమండ్రీ రండి.

* * *

నిత్యజీవితంలోనే యిన్ని అసందర్భాలు కన బడుతూంటే వీలయినంతవరకూ వాటికి దూరంగా